క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. యాకూబ్‌పుర, అబ్బనికుంట, టీఆర్‌టీ కాలనీ, ప్రాంతాల్లో ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కులగణనపై అవగాహన సదస్సు

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణనపై ఈ నెల 14న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ తెలిపారు. బీసీలను చైతన్యం చేయడానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో అలంపూర్ నుంచి అదిలాబాద్ వరకు సమగ్ర కుల గణన అవగాహన చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అందులో భాగంగా గురువారం ఉదయం కాజీపేట ఫాతిమానగర్ ఫాతిమా కాంప్లెక్స్‌లోని వైష్ణవి గ్రాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు జ్వాలాతోరణ మహోత్సవం

రామన్నపేట: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని దేశాయిపేటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, హనుమత్ దేవాలయం, మల్లికార్జున స్వామి దేవాలయాల్లో జ్వాలాతోరణ మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

రాణి రుద్రమదేవిపై ప్రసంగం

హన్మకొండ కల్చరల్: కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాణి రుద్రమదేవిపై ప్రత్యేక ప్రసంగ కార్యక్రమాన్ని ప్రజ్ఞా భారతి వరంగల్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6గంటలకు హనుమకొండ బాలసముద్రంలో సామా జగన్‌మోహన్ స్మారక భవనంలో ఏర్పాటు చేసినట్లు ప్రజ్ఞా భారతి వరంగల్ చాప్టర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎల్‌ఎమ్ రామ్ గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.బుచ్చిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరగనున్న దేశ అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవం లోక మంథన్ -2024లో భాగంగా ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

16న కిట్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

హసన్‌పర్తి: ఈనెల 16న నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 41వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజగోపాల్, అకడమిక్ అఫైర్ డీన్ ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, ప్రొఫెసర్ రామయ్య, డాక్టర్ వి.వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

23న జాతీయ వర్క్‌షాప్

హన్మకొండ కల్చరల్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో సామాజిక శాస్త్రాల పరిశోధన పద్ధతులపై ఒకరోజు జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్, పీహెచ్‌డీ పరిశోధకులు, ఎంఏ విద్యార్థులకు సిద్ధాంత గ్రంథాల రూపకల్పనపై అవగాహన, ప్రాజెక్ట్ రిపోర్ట్సు, పరిశోధన పత్రాలు రాసే విధానం వంటి తదితర అంశాలపై సమగ్రమైన అవగాహన కలిగించడానికి ఈనెల 23న వరంగల్ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల పరిశోధకులు, విద్యార్థులు వివరాల కోసం 90309 99640 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేయూలో మెడికల్ ఆఫీసర్ల నియామకానికి దరఖాస్తులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఆరోగ్య కేంద్రంలో ఒప్పందం ప్రాతిపదికన పూర్తిస్థాయి మెడికల్ ఆఫీసర్లుగా (ఒక పురుష, ఒక మహిళ) పనిచేసేందుకు అర్హులైన ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.60 వేల వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం 4గంటలలోపు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

కరాటే విజేతకు సన్మానం

ఖిలా వరంగల్: ఇటీవల గోవా పెండెం స్టేడియంలో జరిగిన ప్రపంచ కరాటే పోటీల్లో ఖిలా వరంగల్ మధ్యకోటకు చెందిన గోగికారి విశాల్ పాల్గొని బంగారు పతకం, కాసుల వర్షిత్ వెండి పతకం సాధించారు. ఈమేరకు వారిని మధ్యకోటలో స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ దామోదర్ బుధవారం అభినందించారు. కార్యక్రమంలో కాసుల ప్రతాప్ పాల్గొన్నారు.

బంధన్ ఆస్పత్రిపై ఫిర్యాదు

ఎంజీఎం: హనుమకొండ బంధన్ ఆస్పత్రిలో తనకు జరిగిన అన్యాయంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్‌కు బాధితుడు కృష్ణ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాళీప్రసాద్ మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో మహిళా ప్రాంగణం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో ఎటుచూసినా పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ప్రాంగణం ఆవరణలో అనేక రకాల చెట్లు, అందమైన ప్రకృతి ఒడిలో సేదదీరుతున్న అనుభూతి కలుగుతుంది. కార్యాలయం ఎదుట ఏపుగా పెరిగిన అశోక చెట్లు చూపరులకు ఆకట్టుకుంటున్నాయి. హరితహారంలో భాగంగా ఇప్పటి వరకు నిమ్మ, పనస, టేకు, సపోట, మామిడి, నారింజ, అలోవెర, బత్తాయి, 30 రకాల 400లకు పైగా మొక్కలు నాటించామని, మరో 100 మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ వివరించారు.





కార్యాలయానికి వెళ్లేదారిలో ఉన్న పచ్చని మొక్కలు



ప్రాంగణం ఆవరణలో మామిడి మొక్కలు

మంచి వాతావరణం కల్పించాలని..



దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో బ్యూటీషియన్, టైలరింగ్, డీటీపీ, వివిధ రకాల కోర్సుల్లో శిక్షణకు వచ్చే వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో అనేక రకాల మొక్కలు నాటాం. అలాగే, పూల చెట్లు, పండ్ల మొక్కలు నాటాలనుకుంటున్నాం.

- జయశ్రీ, జిల్లా మేనేజర్

క్రీడాభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి రిలయన్స్ ఫౌండేషన్ తోడ్పాటునందించేందుకు కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ తదితర క్రీడా మైదానాలతో పాటు స్పోర్ట్స్ హాస్టల్‌ను డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్‌తో కలిసి ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. రాష్ట్రంలోని ఐదు జిల్లాలో క్రీడల అభివృద్ధికి రిలయన్స్ ఫౌండేషన్ చేయూత అందిస్తోందని, ఈక్రమంలో హనుమకొండలో తమవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రతినిధుల బృందం వెల్లడించింది. అందుకు క్రీడా మెటీరియల్, కోచ్‌ల వివరాలను సభ్యులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్, సాగర్‌పటేల్, దామోదర్ యాదవ్, సాట్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రవికుమార్, కోచ్‌లు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ కోర్టును పరిశీలిస్తున్న ప్రతినిధులు

120 మంది వృద్ధుల లైఫ్ సర్టిఫికెట్ల నమోదు



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో 120 మంది వృద్ధుల డిజిటల్ ఆన్‌లైన్ లైఫ్ సర్టిఫికెట్లను బుధవారం నమోదు చేశారు. సంఘం అధ్యక్షుడు పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వారం రోజులుగా అసోసియేషన్ నాయకులు ఇల్లిల్లు తిరిగి వృద్ధులకు జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ చేస్తున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ రావు, విద్యాసాగర్, ఆంజనేయులు, మండలోజు కృష్ణమూర్తి, దేవదాసు, భాస్కర్, డి.వి.ప్రసాద్, నగేష్, అలీ, చంద్రమోహన్, సత్యనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామన్నపేట: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ స్టేట్ చీఫ్ సెక్రటరీ పోలెపాక మధు సూచించారు. ట్రస్ట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మిర్జా ఫయాజ్ అలీబేగ్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని మండిబజార్‌లో జనత గెస్ట్‌హౌజ్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మధు మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, సత్ప్రవర్తనతో మంచిగా చదువుకొని ఉన్నతస్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మైనార్టీ చైర్మన్, పీసీసీ సెక్రటరీ అయూబ్, గ్రేటర్ వరంగల్ క్రిస్టియన్ ఫెల్లోషిప్ వైస్ ప్రెసిడెంట్ కిన్నెర రవి, ట్రస్ట్ స్టేట్ సెక్రటరీ యాకూబ్ పాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఫిరోజ్, అజీమ్ పాల్గొన్నారు.

భావిభారత నిర్మాణంలో విద్యార్థులు కీలకం



విద్యారణ్యపురి: పుస్తకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని, పక్కన గంధం శివ

విద్యారణ్యపురి: విద్యార్థులు మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని, భావిభారత నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణ కమిటీ వేదిక రాష్ట్ర కన్వీనర్, న్యాయవాది గంధం శివ తల్లిదండ్రులు గంధం గోపాల్, సారలమ్మ స్మారకార్థం హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టుదల, ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వివరించారు. ఇటీవల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయులు మురాల సుధాకర్ రావు, శ్రీనివాస్, మంజుల లింగారావు, యాదగిరి, కుమారస్వామి, వెంకటేష్, సృజన, రాజు, గంధం శివ మిత్రులు బానోతు రాజునాయక్, నరేందర్‌రెడ్డి, అడప రాజు, లచ్చన్న పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రైతు బాంధవుడు యాదగిరిచార్యులు

వరంగల్ చౌరస్తా: వృత్తి ప్రొఫెసర్, ప్రవృత్తి పీడిత రైతుల సమస్యలపై, ఆత్మహత్యల నివారణపై పరిశోధన చేసి పుస్తకాలు రచించి రైతు బంధువుగా పేరొందిన ప్రొఫెసర్ మరిగంటి యాదగిరి మరణం రైతాంగానికి తీరని లోటని ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ ఉద్ఘాటించారు. వరంగల్ అబ్బనికుంటలోని రైతు సంఘ భవనంలో ఆర్థిక, సామాజిక విశ్లేషకుడు ప్రొఫెసర్ యాదరిరిచార్యుల సంతాప సభను రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సంతాప సభలో రైతు సంఘాల నాయకులు ఓదెల రాజయ్య, పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్, ఏఐకేఎఫ్ జిల్లా నాయకులు నగేష్, ఊరటి హంసాల్ రెడ్డి, కత్తి సుధాకర్, చిర్ల రవీందర్, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, మోకెడే పీరయ్య, సోమిడీ సాంబయ్య, నల్ల విజయ్, మోహన్ రావు, గుండెకారి రాజేశ్వర్ రావు, ఎల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కమిటీలో స్థానం కల్పించాలి

న్యూశాయంపేట: జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే అక్రిడిటేషన్ కమిటీలో ఉర్దూ జర్నలిస్టులకు స్థానం కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్టు ప్రతినిధులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ, తెలంగాణ అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అమేర్ అలీఖాన్‌ను హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. మహ్మద్ జమాల్ షరీఫ్, ఎస్ఎం.సయిద్‌లతో పాటు వివిధ దినపత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ప్రదానం

న్యూశాయంపేట: ఉత్తమ జర్నలిస్టు అవార్డును వరంగల్‌కు చెందిన ఉర్దూ టీవి సీనియర్ జర్నలిస్టు మహ్మద్ అబ్దుల్ రజాక్ అక్రమ్ అందుకున్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి సయ్యద్ ఉస్మాన్ రషీద్, అహ్మద్ సిద్దిఖీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కరాటేలో గజ్జల లక్ష్మిసిద్ధార్థ ప్రతిభ

విద్యారణ్యపురి: గోవాలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో హనుమకొండకు చెందిన గజ్జల లక్ష్మిసిద్ధార్థ పాల్గొని ప్రతిభ కనబరిచాడు. కటాస్‌లో రెండు రజిత పతకాలు సాధించాడు. కరాటే మాస్టర్ లింగంపెల్లి వంశీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నట్లు ఆ బాలుడి తండ్రి గజ్జల మల్లేశం తెలిపారు.

ఫ్రీడమ్‌పార్కును అభివృద్ధి చేయాలి

ఖిలా వరంగల్: వెంకటేశ్వర కాలనీలోని ఫ్రీడమ్ పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 43వ డివిజన్‌లోని వినాయక, వెంకటేశ్వర కాలనీల్లో అభివృద్ధికి నోచుకోని ఫ్రీడమ్ పార్కును ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి బుధవారం సందర్శించారు. అనంతరం పార్కు సమస్యను బల్దియా ఎస్‌హెచ్‌ఓ రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తరుగుల శ్రీధర్, ప్రహ్లాదరావు, నరసయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉద్యోగులు

వరంగల్: వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని కొంతమంది ప్రధానోపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏడీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ సత్యశారదను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: బాసర ట్రిపుల్ ఐటీలో ఏబీవీపీ నాయకులపై దాడిని నిరసిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కేయూ ఏబీవీపీ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, బాధ్యులు గట్టు ప్రశాంత్, సాయి, మణికంఠ, అఖిల్, దినేష్, విష్ణువర్ధన్, సాగర్, చందు, లోకేష్, ఆకాశ్, భరత్, నికేతన్, సంతోష్, తేజ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ధర్మయుద్ధం

కాజీపేట రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ధర్మయుద్ధం చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ తెలిపారు. కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మెస్పీ నాయకులు అక్కెనకుంట వెంకటస్వామి, జేరుపోతుల సారంగపాణి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ఉమామహేష్, ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి తిప్పారపు మల్లేషం, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మంద స్వరాజ్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

హన్మకొండ: మానవ సేవే మాధవ సేవ అని శ్రీరామకృష్ణ సేవా సమితి హనుమకొండ అధ్యక్షుడు కటంగూరు సత్యనారాయణ రెడ్డి అన్నారు. శ్రీరామ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నారాయణ సేవ నిర్వహించారు. ఈమేరకు రోడ్లపై ఉంటున్న అభాగ్యులకు అన్నదానం చేయడంతో పాటు చలిని తట్టుకునేందుకు చద్దర్లు అందించారు. కార్యక్రమంలో సభ్యులు కేపీ.రావు, గోరంటల స్వరూప, బోయినపల్లి పార్వతి, లక్ష్మీరావు, చిత్ర సరోజన, ఆటో రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు టీఆర్ బాలసుబ్రమణ్యశర్మ, నిర్వహక అర్చకుడు గణపతిశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని బుధవారం పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు శబరిమల మండల దీక్ష జ్యోతి దర్శనానికి మాల వేసుకునే భక్తులకు మాలధారణ చేశారు.

ఉచిత మధుమేహ పరీక్షలు

హసన్‌పర్తి: లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో హసన్‌పర్తి పెద్ద చెరువు కట్టపై బుధవారం ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు మధుమేహ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి అధ్యక్షుడు కృపాకర్, లయన్స్ జిల్లా నాయకత్వ సమన్వయకర్త డాక్టర్ అజిత్, క్లబ్ సభ్యులు నాగమళ్ల సుధీర్, చెన్నూరి శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఆరెల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం అమలు చేయాలి

హన్మకొండ: అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ - టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా కోరారు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హాజరై ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాళోజీ నారాయణ రావుకు నివాళి



హన్మకొండ: కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, నాయకులు



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: ప్రజాకవి కాళోజీ నారాయణ రావు వర్ధంతిని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈమేరకు కాళోజీ చిత్రపటానికి బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పులి రజనీకాంత్, కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, ఉడుతల సారంగపాణి, సదాంత్, రవీందర్ రావు, నార్లగిరి రమేష్, పరశురాములు, రమేష్, నయీముద్దీన్, మహమూద్, ప్రశాంత్ రాకేష్, వీరస్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎర్రగట్టు గుట్ట వద్ద..

హసన్‌పర్తి: కాళోజీ వర్ధంతి సందర్భంగా ఒకటో డివిజన్ ఎర్రగట్టు గుట్ట జంక్షన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండి రజనీకుమార్, పావుశెట్టి శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, పాడి మల్లారెడ్డి, తోట నాగరాజు, మూల దేవేందర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై వైభవంగా లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన చేస్తున్న భక్తులు

మడికొండ: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య బుధవారం ఉదయం ప్రాతఃకాల మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామి వారికి ఆకాశ దీపోత్సవం నిర్వహించి, ప్రదోషకాల రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించి నీరాజన మంత్రపుష్పం, రాజోపచార పూజలు, నక్షత్ర హారతి, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణధికారి శేషుభారతి, చైర్మన్ రఘుచందర్, ధర్మకర్తలు రాజ్‌కుమార్, రవి, హేమలత, రమేష్, రాజుగౌడ్, దయాకర్, శ్రీనివాస్, ఉమ, జ్ఞానేశ్వరి, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, పొరుపల్లి సత్యనారాయణ శర్మ, మణిశర్మ, దేవేందర్‌శర్మ, సాయిశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను విస్మరించడం సరికాదు

ఖిలా వరంగల్: కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం సరికాదని సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాషుమియా మాట్లాడుతూ కార్పొరేట్, పెట్టుబడిదారి యాజమాన్యాలకు మేలు చేస్తూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి పాలకులు పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ పోరాడుతోందని తెలిపారు. సమావేశంలో దండు లక్ష్మణ్, గుంపెల్లి మునీశ్వర్, బద్రిఖాసీం, గోవర్ధన్, తాళ్లపల్లి జాన్‌పాల్, యాకూబ్, బొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాషుమియా

వీధి వ్యాపారులను ఆదుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న లింగమూర్తి

వరంగల్ చౌరస్తా: 2009వ సంవత్సరంలో వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫుట్‌పాత్ ఆవాజ్ అనే పథకం ద్వారా వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని వీధి వ్యాపారులకు అనువైన స్థలాలను కేటాయించి, సౌకర్యాలు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తి డిమాండ్ చేశారు. వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో వీధి వ్యాపారుల సమావేశం గడ్డం సుధాకర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ హనుమకొండలో 5 చోట్ల హాకర్స్ జోన్లు ఏర్పాటు చేశారని, వరంగల్ తూర్పులో ఒక్కటి కూడా ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. తూర్పు వీధి వ్యాపారుల కోసం జోన్లు ఏర్పాటు చేసి మడిగెల నిర్మాణం వెంటనే చేపట్టాలని మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంగరబోయిన చందర్, సింగిరెడ్డి ఉపేందర్, సింగారపు రంజిత్, మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు మేకల రవి, సంగి ఎల్లయ్య, రాచర్ల రాజేందర్, ఈరమ్మ, శ్రీధర్, జన్ను రాజు, అబ్దుల్ నబి, సీతయ్య, విజయబాబు, శ్రీను, బేగం, వనమాల, ఉపేంద్ర, జహూర్ తదితరులు పాల్గొన్నారు.

సప్తధామంలో సత్యనారాయణ వ్రతాలు

వరంగల్: సమష్టిగా సత్యనారాయణస్వామి వ్రతం, హోమం చేస్తే యావత్ జీవకోటికి శాంతి, ఆనందం, సౌభ్రాతత్వం, సుఖ జీవనం, ఆరోగ్యం కలుగుతుందని గురుదేవులు శివానందమూర్తి చెబుతుండేవారని శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ గుర్తుచేశారు. ఆరెపల్లి సమీపంలోని సప్తగురుధామంలో బుధవారం జరిగిన సమష్టి శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాల్లో సుమారు 400 మంది దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారని తెలిపారు. మరో ట్రస్టీ బండారు సాయినారాయణ మాట్లాడుతూ సమష్టి వ్రతాల్లో పూజలు నిర్వహించిన దంపతులతో పాటు వెయ్యికి పైగా సాధారణ భక్తులు వచ్చారని, అందరికి మహా అన్నప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు సోమ రామయ్య, సదాశివుడు, పబ్బ విశ్వేశ్వర్, వెంకటరమణ, ఉమాశంకర్, రాంచందర్, రామిరెడ్డి, విజయకుమార్, లయక్ అలీ పాల్గొన్నారు.



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న ట్రస్టీలు

క్రైం కార్నర్

రూ.4.48 లక్షల రేషన్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి: రూ.4లక్షల 48వేల విలువైన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని చిన్నంగి చెరువు సమీపంలో స్థానిక ఎస్సై సిద్దయ్య ఆధ్వర్యంలో పెట్రోల్ నిర్వహిస్తుండగా కట్టపై నుంచి వస్తున్న డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా, అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం లభ్యమైంది.

అండర్ బ్రిడ్జి వద్ద అగ్నిప్రమాదం

వరంగల్ చౌరస్తా: వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలో ఎల్‌బీఆర్ నగర్(కొండా పటేల్) బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో ఏడుగురు చిరువ్యాపారులకు చెందిన డబ్బాలు, తాత్కాలిక తడకలు దగ్ధమయ్యాయి. సమాచారం మేరకు ఫైర్ ఇంజన్ చేరుకొని మంటలు ఆర్పేలోపు అప్పటికే దగ్ధమయ్యాయి. చిరువ్యాపారులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయాలని వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్‌ను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.

తాటి చెట్టుపై నుంచి పడిన గీత కార్మికుడు

మామునూరు: ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడిన గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం రాత్రి ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో తాటి వనంలో జరిగింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం బొల్లికుంట గ్రామానికి చెందిన పెరుమాండ్ల రాజు (40) గీత రాత్రి మెరవేసేందుకు తాటి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో మోకు జారి చెట్టుపై నుంచి పడిపోయాడు. తీవ్రగాయాలతో అర్ధరాత్రివరకు అక్కడే ఉండడంతో, గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నియామకం

కాజీపేట: రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాజీపేట పట్టణానికి చెందిన పిల్లి క్రిష్టఫర్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవికుమార్ నుంచి నియామక పత్రం అందుకున్నారు.